క్లుప్తంగా

శ్రమదానంతో తుప్పల తొలగింపు



శ్రమదానం చేస్తున్న యువకులు

గంగవరం : స్థానిక మధ్య వీధిలో వెలసిన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం కట్రం అబ్బాయి దొర చిన్నారావు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారి గుడి పరిసరాలను, గుడి సమీపంలోని గల ఆర్అండ్బీ రోడ్డుకిరు వైపులా పెరిగిపోయిన తుప్పలను తొలగించారు. ఈ నెల 15 నుంచి దసరా నవరాత్రులు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు వంచంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష

రాజవొమ్మంగి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని వంచంగి సచివాలయం వద్ద సోమవారం ఉదయం 9 నుంచి సాయంకాలం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పాముకాటుతో గిరిజనుడికి అస్వస్థత



వైద్యసేవలు పొందుతున్న గిరిజనుడు సాదు

సీలేరు: మండలంలోని దుప్పలవాడ పంచాయతీ వలసగడ్డకొత్తూరు గ్రామానికి చెందిన సుంకరి సాదు (52) అనే గిరిజనుడు పొలం వద్ద వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా ఆదివారం పాముకాటుకు గురయ్యాడు. సాదు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెను వెంటనే సీలేరు ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. సకాలంలోని వైద్యసేవలు అందడంతో ప్రాణపాయం తప్పింది.

రహదారులు జలమయం



వై.రామవరంలో కురుస్తున్న వర్షం

వై.రామవరం: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలపాటు ఏకధాటిగా ఉరుములతో కూడిన వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా చేరింది. కొన్ని ప్రాంతాల్లో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



జడ్డంగి వద్ద ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్

రాజవొమ్మంగి: ఏలేశ్వరం నుంచి అల్లూరి జిల్లా రేవళ్ల వెళ్ళాల్సిన ఆర్టీసీ బస్‌కు ఆదివారం జడ్డంగి గ్రామ శివారులో త్రుటిలో ప్రమాదం తప్పింది. వర్షపు చినుకులు కారణంగా నిర్మాణదశలో ఉన్న ఎన్‌హెచ్ 516 చిత్తడిగా మారింది. ఈ మార్గంలో వెళ్తున్న బస్సు అదుపుతప్పి రోడ్డు దిగువకు దిగిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా బస్‌ను అదుపు చేయగలగడంతో పక్కనే పెద్ద గొయ్యి నుంచి తప్పించుకున్నట్టు ప్రయాణికులు చెప్పారు. శనివారం రాత్రి జరిగిన సంఘటనలో లోడ్‌తో రాజవొమ్మంగి వైపు వస్తున్న క్వారీ లారీ తంటికొండ వద్ద బురదలో కూరుకుపోయింది. రోడ్డు నిర్మాణ కార్మికులు యంత్రాల సహాయంతో బయటకు తీశారు.

మార్గం.. సుగమం

- శివారు గ్రామాల్లో శరవేగంగా రహదారుల నిర్మాణం
- అరకు నియోజకవర్గంలో 128 తారురోడ్ల పనులు పూర్తి
- ఆనందంలో గ్రామస్తులు

అధ్వాన దారులు.. గోతులమయం.. కిలోమీటరు ప్రయాణం గగనం.. మన్యంలో ఎక్కడ చూసినా గతంలో ఈ పరిస్థితి ఉండేది... నాడు అధ్వానంగా ఉన్న రహదారులు..నేడు అద్దంలా దర్శనమిస్తున్నాయి. దశాబ్దాల తరబడి కనీస మట్టి రోడ్లు లేని శివారు గ్రామాల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో తారురోడ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడింది. మారుమూల గ్రామాల్లోనూ మార్గం సుగమవడం.. ఏళ్ల తరబడి కల సాకారమవడంతో గిరిజనుల ఆనందానికి అవధుల్లేవు.



గుల్లేలు నుంచి ఇంజరి తారురోడ్డు



రూడకోట నుంచి జామిగుడ తారురోడ్డు

పెదబయలు: గతంలో మన్యంలో రహదారులు దారుణంగా ఉండేవి. ఏళ్ల తరబడి కనీస మరమ్మతుకు నోచుకోక పెద్ద పెద్ద గోతులతో గ్రామస్తులు నానా అవస్థలు పడ్డారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉండేది. గత టీడీపీ హయాంలో మన్యంలో కనీస అభివృద్ధి పనులు జరగలేదు. రహదారుల పనులు గురించి పట్టించుకోలేదు. రోడ్లు బాగోలేక చాలా ప్రాంతాలకు బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్ల సమస్యపై పలుమార్లు పాలకులకు గిరిజనులు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. అదంతా గతం.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మన్య ప్రాంతం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. మారుమూల ప్రాంతాల్లో కూడా రహదారులు చేపట్టేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోంది. గతంలో టీడీపీ పాలకులు మాయమాటలతో సరిపెడితే నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి పనులతో ముందుకు సాగుతోందని గిరిజనులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి కల సాకారమవడంతో పాటు రవాణా వ్యవస్థ మెరుగుపడడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

గ్రామాల రహదారులకు మహర్దశ

అరకు నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాల్లో రహదారుల కోసం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రత్యేక చొరవ చూపడంతో ఏళ్ల తరబడి కనీస అభివృద్ధికి నోచుకోని గ్రామాలకు మహర్దశ కలిగింది. నాడు అధ్వానంగా ఉన్న రహదారులు నేడు అద్దంలా దర్శనమిస్తున్నాయి. అరకు నియోజకవర్గంలో ప్రతి పంచాయతీలో రహదారుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మారుమూల ప్రాంతాలకు కూడా ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులో వచ్చాయి. ముంచంగిపుట్టు మండలం కుజభంగి జంక్షన్ నుంచి ఉన్న రహదారి పెద్ద పెద్ద గోతులతో గత 15 ఏళ్లుగా దర్శనమిచ్చేది. అలాగే ముంచంగిపుట్టు మండల కేంద్రం నుంచి రూడకోట వరకు ఇదే పరిస్థితి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది నెలల్లోనే ఆయా ప్రాంతాల్లోని రహదారి పనులు శరవేగంగా పూర్తయ్యాయి. దీంతో ప్రస్తుతం ముంచంగిపుట్టు, పెదబయలు మండల కేంద్రాలకు గతంలో వెళ్లాలంటే నానా అవస్థలు పడేవారమని, రోడ్లు బాగాలేక ఆర్టీసీ సర్వీసులకు రద్దు చేశారని, ఇప్పుడు బస్సు సర్వీసు కుమడ వరకు అందుబాటులో వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. కిముడుపల్లి పంచాయతీ బంగారుమామిడి గ్రామం నుంచి అరడగూడెం మీదుగా గాడేపల్లి వరకు రోడ్డుకు మహర్దశ కలిగింది. పాడేరు మండలం గుత్తులపుట్టు నుంచి బంగారుమామిడి వరకు వరకు తారురోడ్లు నిర్మించారు.అరడగూడెం నుంచి గోమంగి, బంట్రోతిపుట్టు నుంచి కుంతుర్ల వరకు, పెదబయలు మారుమూల రూగకోట నుంచి జామిగుడ వరకు, గుల్లేలు నుంచి ఇంజరి వరకు తారురోడ్డు పనులు జరిగింది. కరుగొండ వరకు తారురోడ్డు సిరశపల్లి నుంచి తోటలగొంది వరకు, అరడకోట నుంచి వనభంగి, పురుడిపుట్టు వనభంగి వరకు,చేదుపుట్టు నుంచి పులిగొంది వరకు పెదబయలు మండలంలోనే 26 తారురోడ్లు నిర్మించారు. వర్షాల కారణంగా పనుల్లో కొంత జాప్యం జరుగుతుంది. స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి చేపట్టని తారురోడ్లు నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి కలిగిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రహదారుల నిర్మాణం చరిత్రాత్మకం

మట్టి రోడ్డు లేని పంచాయతీల్లో నేడు తారురోడ్ల నిర్మాణం జరిగింది .రూడకోట నుంచి జామిగుడ వరకు..గుల్లేలు నుంచి ఇంజరి వరకు తారురోడ్లు నిర్మించారు.దీంతో ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ పాలకులు మాయ మాటలతో సరి పెడితే నేడు అభివృద్ధి పనులు చేసి చూపిస్తున్నారని ప్రజలు పెద్ద ఎత్తున ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– జర్సింగి రాంనాయుడు, గుంజివాడ గ్రామం

జోరందుకున్న పనులు



పెదబయలు మండలంతో పాటుగా అన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం జరుగుతుంది. ఎన్నడూ లేని విధంగా కనీస రహదారి లేని గ్రామాలపై దృష్టి పెట్టాం. రోడ్ల నిర్మాణం, వంతెనల నిర్మాణాలు జరుగుతున్నాయి. మిషన్ కనెక్ట్ పాడేరుతో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం జరిగింది. వర్షాల వల్ల పనులకు కొంత ఆటంకం కలిగింది. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇంజరి నుంచి కోంద్రుం వరకు.జక్కం నుంచి కోంద్రుం రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

– ఎం.శంకర్‌రావు, ఏఈ, పంచాయతీ రాజ్, పాడేరు

అన్ని గ్రామాలకు రోడ్లు



అరకు నియోజకవర్గంలో రోడ్డు లేని అన్ని గ్రామాలకు తారురోడ్డు నిర్మాణమే లక్ష్యంగా దశలవారీగా పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో చాలా చోట్ల తారు రోడ్లు నిర్మాణం జరిగింది, మిగిలిన ప్రాంతాల్లోని రోడ్లు పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మండలంలో బ్రిటీష్ కాలం నుంచి రోడ్డు చూడని రోడ్లకు తారురోడ్డు నిర్మాణం జరుగుతుంది. రోడ్లు లేని పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించాం. తారురోడ్ల నిర్మించిన అనంతరం మిషన్ కనెక్ట్ పాడేరు ప్రాజెక్టు ద్వారా పంచాయతీలకు అనుసంధానం చేస్తు రహదారులు పనులు చేయిస్తాం. ఈ ఏడాదిలో అన్ని రోడ్ల నిర్మాణం పూర్తవుతుంది.

– చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

రాజవొమ్మంగి: విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో తలపెట్టిన శౌర్య జాగరణ రథ యాత్ర సోమవారం రాజవొమ్మంగి మీదుగా ముందుకు సాగనుంది. ఈ మేరకు యాత్ర నిర్వాహకులు వివరాలు అందజేస్తు ఉదయం 9 గంటలకు స్థానిక షిర్డీ సాయిబాబా మందిరానికి చేరుకొంటుందని, ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం ఊరేగింపుగా స్థానిక శ్రీవేంకటేశ్వస్వామి వారి ఆలయానికి చేరుకొంటుందని నిర్వాహకులు విలేకరులకు తెలిపారు. ఆ తరువాత యాత్ర నర్సీపట్నం వైపు సాగుతుందన్నారు. హైందవ ధర్మ పరిరక్షణ, దేశ సంస్కృతీ, సంప్రదాయాల విశిష్టతను యువతకు తెలియజెప్పేందుకు ఉద్దేశించబడ్డ ఈ యాత్ర ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో జరుపుతున్నామన్నారు. రాజవొమ్మంగి చేరుకొంటున్న రథ యాత్రలో భక్తులు పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్ష



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

అరకులోయటౌన్: అరకులోయలో తపాల శాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే దీన్ దయాల్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ పరీక్షకు 55 మంది విద్యార్థులు హాజరైనట్టు అరకులోయ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన 40 మంది విద్యార్థులకు సంవత్సరానికి రూ.6వేలు స్కాలర్‌షిప్ పోస్టల్‌శాఖ అందిస్తోందన్నారు. ఈ పరీక్షల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతోపాటు విజ్ఞాన భారతి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. అరకులోయ పోస్ట్ మాస్టర్ దిలీప్, మెయిల్ ఓవర్‌సీస్ గోపాల్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ సాయి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట ప్రభుత్వ హైస్కూల్లో సోమవారం బాల బాలికల సెపక్‌తక్రా బాల్ గేమ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరగనున్నట్లు పీడీ జి.నూకరాజు తెలిపారు. 14 ఏళ్లు, 17 ఏళ్లలోపు విభాగాల్లో సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్లను స్టేట్ మీట్‌కు పంపిస్తామన్నారు.

విజయవాడకు నేతలు పయనం

- వైఎస్సార్‌సీపీ సదస్సుకు తరలివెళ్లిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- ప్రత్యేక బస్సుల ఏర్పాటు



అరకులోయ పార్టీ నేతలతో కలిసి బస్సులో విజయవాడ వెళ్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



నేతలతో కలిసి విజయవాడకు బస్సులో వెళ్తేన్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు,ఏపీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం విజయవాడలో జరిగే వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సుకు జిల్లా నుంచి వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు తరలివెళ్లారు. జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాడేరు నియోజకవర్గానికి సంబంధించిన ప్రత్యేక బస్‌ను ఆదివారం పాడేరులో జెండా ఊపి ప్రారంభించడంతో పాటు అదే బస్సులో నేతలతో పాటు ఎమ్మెల్యే ప్రయాణించారు.అరకులోయలోని ప్రత్యేక బస్‌లను కూడా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ జెండా ఊపి ప్రారంభించడంతో నేతలంతా ఉత్సాహంగా విజయవాడకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ బస్సులో వారితో పాటు ప్రయాణించి సందడి చేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలోను ముఖ్యనేతలంతా విజయవాడకు బయలుదేరారు. పార్టీ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు,సోషల్ మీడియా కన్వీనర్లు తదితర 25 విభాగాల్లో ఉన్న పార్టీ ప్రతినిధులు మాత్రమే విజయవాడ సదస్సుకు ప్రత్యేక బస్‌లలో తరలివెళ్లారు.

నేడు హెచ్‌ఎంల సమావేశం

గంగవరం : అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం ఉదయం 11 గంటలకు మండల విద్యాశాఖ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సింగిల్ టీచర్స్ మధ్యాహ్నం రెండు గంటలకు హాజరుకావాలన్నారు. సమావేశానికి విద్యార్థుల అడ్మిషన్ రిజిస్టర్ తీసుకురావాలని సూచించారు. ఈ విషయమై అలసత్వం వహిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, అందరూ విధిగా ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

పెదబయలు: మండల వినియోగదారుల సంఘం ఎన్నిక స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బి.చిట్టిబాబు, కార్యదర్శి కె.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వినియోగదారుల హక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. వినియోగదారులు హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం అందరూ పనిచేయాలని సభ్యులకు సూచించారు. నాయకులు చెండా లోయితాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి



యార్లగడ్డలో మండల కమిటీ ఎన్నికలో పాల్గొన్న జిల్లా నేతలు

వై.రామవరం: ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం మండల నూతన అధ్యక్షుడిగా ముర్ల సూరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని యార్లగడ్డ గ్రామంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వెదుళ్ళ లచ్చిరెడ్డి, జిల్లా కార్యదర్శి మడిగొంట వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడు సూరిబాబుతో పాటు, ఉపాధ్యక్షులుగా పండా సతీష్, కార్యదర్శిగా తాంబ్రాల విక్టర్‌పాల్, జాయింట్ సెక్రటరీగా వలాల సత్యనారాయణరెడ్డి, కోశాధికారిగా పల్లాల పండు రెడ్డి, కమిటీ సభ్యులుగా కయ్యం శ్రీనుబాబు, గుడ్ల ప్రసాదు, జమ్మల అబ్బాయి, బచ్చల రమేష్‌రెడ్డి, గంత సత్తిబాబు, కయ్యం రాజబాబు, కుంజం అప్పన్నదొర, పల్లాల కృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీతో జిల్లా నేతలు ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం, హక్కులు కాపాడుకోవడం కోసం సంఘం నేతలంతా పారదర్శకతతో పనిచేస్తు పోరాడి విజయం సాధించాలన్నారు. పలువురు ఆదివాసీ పెద్దలు పాల్గొన్నారు.

అందని సాగునీరు.. ఆందోళనలో రైతులు



దొడ్డవరం చెరువు కింద భూమిని ఖాళీగా ఉంచిన రైతులు

కొయ్యూరు: మర్రివాడ సమీపంలో ఆయుకట్టు పాడైపోవడంతో దాదాపుగా 200 ఎకరాలకు నీరందడం లేదు. వరిని పండించే ఆ రైతులంతా ఆకుమడులను వేశారు. అయితే దానిని బాగు చేయడం సాధ్యం కాకపోవడంతో ఇప్పుడు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు చూస్తున్నారు. మండలంలోని దొడ్డవరం, తాళ్లపాలెం, చీడిపాలెంలో భూములకు దొడ్డవరం కాలువ నీటిని అందిస్తుంది. అయితే రెండునెలల కిందట ప్రధాన కాలువ నుంచి నీటిని తీసుకువచ్చే ఆయుకట్టు కూలిపోయింది. దీంతో సాగునీరు అందని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. సాగునీరందకు పొలాల ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు మాత్రం అపరాలు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల రైతులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన నీటిపారుదల శాఖాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. దీనిపై నీటిపారుదల శాఖ జేఈ రామకృష్ణ మాట్లాడుతూ ఇది వరకు ప్రతిపాదనలు పంపించామన్నారు.వర్షాలు తగ్గిన తరువాత పనులు చేపడామని తెలిపారు.

ప్రయాణం.. మరింత సురక్షితం

- స్పీడ్ స్టాపర్లు ఏర్పాటు
- చిలకలగెడ్డ, వెంకయ్యపాలెం, అనంతగిరి ప్రధాన దారుల్లో రేడియం స్టిక్కర్లతో డ్రమ్ములు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనచోదకులు



చిలకలగెడ్డ వద్ద ఏర్పాటు చేసిన డ్రమ్ములు

అనంతగిరి: మన్యం అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు అనంతగిరి ఘాట్‌రోడ్డుపై అవగాహన లేకపోవడంతో ఇటీవల పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రమాదాలు నివారించేలా మరో అడుగుముందుకు వేసింది.. ఇప్పటికే చిలకలగెడ్డ మొదలుకొని భీసుపురం వరకు పలు ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వెంకయ్యపాలెం నుంచి చిలకలగెడ్డ మీదుగా బొడ్డవర వరకు ఎన్‌హెచ్‌లో రోడ్డు విస్తరణ చేపట్టారు. చిలకలగెడ్డ సమీపంలోని ఇటీవల రెండు ద్విచక్రవాహనాలు, ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే లారీ ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేలా పోలీస్‌శాఖ దృష్టి సారించి, వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలు జరగకుండా చిలకలగెడ్డ, వెంకయ్యపాలెం, అనంతగిరి వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన డ్రమ్ములను పోలీస్‌శాఖ ఏర్పాటు చేసింది. ప్రమాదాలు నివారించేలా పోలీస్‌శాఖ చర్యలపై వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రమాదాలు నివారించి, వేగాన్ని నియంత్రించేలా ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు ముందస్తు చర్యలు చేపట్టా. అలాగే ఘాట్‌రోడ్డు ప్రయాణంపై తనిఖీలు సమయంలోని వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్నాం. అలాగే ఇప్పటికే ఘాట్‌రోడ్డులోని ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేశాం.

–కరక రాము, ఎస్ఐ, అనంతగిరి

ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అట్టహాసంగా జరిగింది. పాఠశాలలో 1989–90లో పదో తరగతి పూర్తి చేసిన వీరంతా అద్దూరులోని మద్దిగైరమ్మ గుడి ఆవరణలో వీరంతా కలిశారు. సుమారు 33 ఏళ్ల కిందట ఆ పాఠశాలలో చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా కలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను,అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గ్రూపు ఫొటోలు తీసుకొని సందడి చేశారు. చదువు చెప్పిన గురువులు సైన్స్ టీచర్ ప్రకాష్ ,తెలుగు టీచర్ ఏసుదాసు,సోషల్ టీచర్ విష్ణు మాస్టర్‌లను పూర్వ విద్యార్థులంతా ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల్లో సబ్బవరం ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, అన్నంరెడ్డి రమణమ్మ, జక్కాన సత్యవతి,కర్రి సన్యాసమ్మ,కామిరెడ్డి శ్రీనివాసరావు,గండి అప్పలనాయుడు,పంచదార్ల రమణ,గండి నాగరాజు,కొల్లి దేముడుబాబు,సబ్బవరపు నాయుడు,సబ్బవరపు వెంకట రమణ తదితరులు ఉన్నారు.

సర్వకామదాంబకు నిమ్మకాయల పూజ



ప్రత్యేక అలంకరణలో సర్వకామదాంబ



సామూహిక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారికి నిమ్మకాయల పూజ నేత్రపర్వంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కనకదుర్గమ్మ మాలధారణ, సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్ర నామార్చన, విజయదశమి రోజున జమ్మి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ముందస్తుగా పశువులకు టీకాలు



జిల్లేడుపూడిలో పశువుకు టీకా వేస్తున్న గోపాలమిత్రుడు కిల్లాడ వెంకటరమణ

నాతవరం: పశువులకు గాలికుంటు, లంపీ స్కిన్ రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నామని గోపాలమిత్రులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ తెలిపారు. ఆయన ఆదివారం జిల్లేడుపూడి లక్ష్మీపురం ఆర్.వెంకయ్యపాలెం , గోవిందపురం గ్రామాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన వ్యాక్సిన్లు పశువులకు వేసి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాల వారీగా పశువులకు గాలికుంటు, లంపీస్కిన్ రాకుండా వ్యాక్సిన్లు సరఫరా చేసిందన్నారు. ఆయా వ్యాక్సిన్లు పాయకరావుపేట వెటర్నరీ ఏడీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రైతుల కల్లాలు వద్దకే వెళ్లి పశువులకు వేస్తున్నామన్నారు. సీజనల్‌గా పశువులకు వచ్చే వ్యాధులు పట్ల రైతులకు తెలియజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో 198 మంది గోపాలమిత్రులు ఈ వ్యాక్సిన్లు వేస్తున్నారన్నారు. వీటితోపాటు పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రామ్మోహన్‌రావు ఆదేశాల ప్రకారం కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేస్తున్నామన్నారు.